క్లుప్తంగా

బార్ అసోసియేషన్ ప్రతినిధులకు సన్మానం

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఈనెల 27వ తేదీన విజయం సాధించిన అధ్యక్షుడు రాపర్తి రవీందర్, ప్రధాన కార్యదర్శి రాజీవ్‌రెడ్డిలను శనివారం జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రె విశాల్ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించారు. నాయకులు గణేశ్, సప్త శ్రీనివాస్, మల్లయ్య, జాడి ప్రకాశ్, పెంటయ్య, వినోద్, సాయి, రత్నం, రవి తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ సన్మానం

కాగజ్‌నగర్‌రూరల్: మున్సిపల్ కార్యాలయంలో ఆర్‌ఐగా విధులు నిర్వహిస్తున్న బాపు శనివారం పదవీ విరమణ పొందారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ షహీనా సుల్తానా, కమిషనర్ అంజయ్య, వైస్‌చైర్మన్ స్వామిశెట్టి రాజేందర్‌తో పాటు కౌన్సిలర్లు, సిబ్బంది బాపు దంపతులను సన్మానించారు.

సింగరేణి ఉద్యోగులకు స్వీటు బాక్సులు అందజేయాలి

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో ఉత్పత్తి సాధించినందుకు ప్రతీ ఉద్యోగికి, అధికారులకు, కాంట్రాక్ట్ కార్మికులకు గత సంవత్సరంలో ఇచ్చిన విధంగా స్వీటు బాక్సులు అందించాలని కోరుతూ టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ నాయకులు పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతికి వినతిపత్రం అందజేశారు. టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ నాయకులు మంగీలాల్, ఏరియ కమిటీ నాయకులు చంద్రశేఖర్, వెంకటేష్, రాజేశం పాల్గొన్నారు.

'రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి'



మాట్లాడుతున్న గోడం నగేశ్

రెబ్బెన: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను అడుగడుగున ఎండగట్టాలని ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన మండలస్థాయి పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌తో కలిసి పదాధికారులు, బూత్‌స్థాయి అధ్యక్షులు, కార్యకర్తలకు పార్లమెంట్ ఎన్నికలపై దిశా నిర్దేశం చేశారు. నాయకులు ఆంజనేయులు గౌడ్, ధోని శ్రీశైలం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ప్యూరిఫయర్ అందజేత



ప్యూరిఫయర్ అందజేస్తున్న కంపెనీ సభ్యులు

వాంకిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలకు ప్రభాత్ అగ్రి బయోటెక్ సీడ్స్ కంపెనీ ప్రతినిధులు శనివారం కెంట్ ఆర్వో వాటర్ ప్యూరిఫయర్‌ను ఉచితంగా అందజేశారు. కంపెనీ సేల్స్ ఆఫీసర్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా వాటర్ ప్యూరిఫయర్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్లు శివకుమార్, లక్ష్మి నారాయణ, రామగిరి శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు బియ్యం పంపిణీ



బియ్యం పంపిణీ చేస్తున్న సీఐ రాంబాబు, ఎస్సై సోనియా

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఊట్‌పల్లి గ్రామంలో ఆరు నిరుపేద కుటుంబాలకు శనివారం కాగజ్‌నగర్‌రూరల్ సీఐ రాంబాబు, ఎస్సై సోనియాలు బియ్యం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల్లో నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. బాల్యవివాహాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎండిపోయిన పల్లెప్రకృతి వనం

నార్నూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె ప్రకృతివనం నిర్వహణ కరువై ఎండిపోతోంది. గాదిగూడ మండలంలోని పర్సువాడ పరిధిలోని పల్లె ప్రకృతి వనం పూర్తిగా ఎండిపోయింది. ఇందులో దాదాపు 40 రకాల మొక్కలు పెంచుతున్నారు. వన సేవకుడు లేక నిర్వహణను గాలికి వదిలేశారు. దీంతో ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది. సంబంధిత అధికారులు స్పందించి మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెక్‌డ్యాం వద్ద అడుగంటిన నీరు



ఎండుతున్న వరి పంట



వాగులో జేసీబీతో నీటికోసం తవ్వకాలు జరుపుతున్న రైతులు



భగీరథ ప్రయత్నం

చింతలమానెపల్లి మండలంలోని చెరువులు, చెక్‌డ్యాంలల్లో నీరు అడుగంటిపోవడంతో యాసంగి పంట సాగు చేసిన రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సాగు చేసిన పంటలకు నీరందించేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. మండల కేంద్రం సమీపంలోని వాగుపై నాలుగేళ్ల క్రితం చెక్‌డ్యాం నిర్మించారు. ఈ చెక్‌డ్యాం నీటి ఆధారంగా సుమారు 40 ఎకరాలలో మిరప, వరి వంటి పంటలు సాగు చేశారు. ఈఏడాది వర్షాలు తగినంతగా లేక పోవడంతో పాటు ఫిబ్రవరి నుంచే మండుతున్న ఎండల నేపథ్యంలో చెక్‌డ్యాంలో నీరు అడుగంటింది. పంటలు పొట్టకు వచ్చిన దశలో చెక్‌డ్యాంలో నీరు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చెక్‌డ్యాం కింద వాగులో జేసీబీతో గుంతలు తవ్వి వచ్చిన నీటిని డీజిల్, విద్యుత్ మోటార్ల ద్వారా పంటలకు తరలిస్తున్నారు. కాగా ఈ నీరు కూడా సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుపయోగంగా ఉన్న అర్కగూడ ప్రాజెక్టు నీటిని విడుదల చేస్తే చెక్‌డ్యాంలోకి నీరు చేరుతుందని, తద్వారా పంటలు సాగవుతాయని రైతులు పేర్కొంటున్నారు.

– చింతలమానెపల్లి

పనులు మళ్లీ షురూ..!



కొనసాగుతున్న రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు

- రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభం
- తీరనున్న ప్రయాణికుల కష్టాలు
- త్వరితగతిన పూర్తి చేయాలని వేడుకోలు

సిర్పూర్(టి): మండలంలోని సిర్పూర్(టి) –కాగజ్‌నగర్ ప్రధాన రహదారిలో గల వేంపల్లి రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులు పునఃప్రారంభం కావడంతో మండలవాసులతో పాటు నియోజకవర్గ ప్రజల సమస్యలు తీరనున్నాయి. 2013 –14వ సంవత్సరంలో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా అప్పట్లోనే పనులు ప్రారంభించారు. అనంతరం అటవీశాఖ అనుమతులు లేవని తాత్కాలికంగా పనులు నిలిపివేశారు. అనంతరం తిరిగి పనులు ప్రారంభించినా నత్తనడకన కొనసాగించి కరోనా లాక్‌డౌన్‌తో మళ్లీ పనులు నిలిపివేశారు. కొన్నాళ్లకు పనులు తిరిగి ప్రారంభించినా గత ఏడాది కాలంగా పనులు ముందుకు సాగడం లేదు. దీంతో వేంపల్లి రైల్వేగేటు పనులు పూర్తవడం కలగానే మిగిలేలా ఉందని నియోజకవర్గ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నుంచి రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి రైల్వేలైన్‌పై గ్యాడర్ పనులు ప్రారంభించడంతో ప్రజల్లో మళ్లీ ఆశలు మొదలయ్యాయి. ప్రయాణికుల సౌకర్యార్థం త్వరలోనే పనులు పూర్తి చేసిఫ్లై ఓవర్ బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకొస్తామని రైల్వే అధికారులు తెలియజేయడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గంటల తరబడి నిరీక్షణ..

ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తయితే సిర్పూర్ (టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, కాగజ్‌నగర్, దహెగాం, పెంచికల్‌పేట్ మండలాలతో పాటు సమీపంలోని మహారాష్ట్ర పట్టణాల ప్రజలు ఏళ్లుగా పడుతున్న ఇబ్బందులు తీరనున్నాయి. ప్రతీరోజు రాత్రి, పగలు వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు కొనసాగుతున్న ప్రధాన రహదారి కావడంతో ప్రతినిత్యం రహదారి రద్దీగా ఉంటుంది. రైల్వేగేటు వద్ద వంతెన పూర్తికాకపోవడంతో రైల్వేగేటు వద్ద గంటల తరబడి వాహనాలు నిలిచి ఉండాల్సిన పరిస్థితి ఉంది.

త్వరగా పూర్తి చేయాలి



ఎన్నో ఏళ్లుగా రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. వంతెన నిర్మాణం పూర్తయితే వాహనదారులు, ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. – వడ్డేటి నానయ్య

ఏళ్లుగా జాప్యం



ఎన్నో ఏళ్లుగా వంతెన నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. సిర్పూర్(టి) –కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై ప్రయాణాలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి. – ఎస్.మహేశ్

అక్రమ దందాలకు పాల్పడితే చర్యలు



అవగాహన కల్పిస్తున్న సీఐ సాధిక్‌పాషా

కౌటాల: అక్రమ దందాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కౌటాల సీఐ సాధిక్‌పాషా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వీరభద్ర కాలనీలో సీఆర్‌పీఎఫ్ సాయుధ బలగాలతో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. అక్రమ దందాలు చేస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రజలు సహకరించాలన్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలకు జరిమానాలు విధించినట్లు తెలిపారు. ఎస్సై మధుకర్, పోలీసులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ కనక మోతుబాయి

నార్నూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశం హాల్‌లో శనివారం ఎంపీపీ కనక మోతుబాయి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సదాసీదాగా సాగింది. మొత్తం ఆరుగురు ఎంపీటీసీ సభ్యులకు నలుగురు మాత్రమే హాజరయ్యారు. ఎంఈవో రాపల్లి ఆశన్న, అటవీశాఖ నుంచి ఎఫ్‌బీవో శ్రీనివాస్, ఐసీడీఎస్ నుంచి సీడీపీవో శారదలు మాత్రమే హాజరయ్యారు. కనీసం శాఖల వారీగా ప్రగతి నివేదికలు చదివేవారు కూడా కరువయ్యారు. దీంతో సమావేశం తూతూమంత్రంగా జరిగింది. గిరిజన గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో బిందెడు నీటి కోసం కష్టాలు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని భీంపూర్ ఎంపీటీసీ సభ్యురాలు జాదవ్ రేణుక దిలీప్ వాపోయారు. నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. గ్రామ పంచాయతీలకు నియమించిన ప్రత్యేకాధికారులు ఇప్పటి వరకు గ్రామ పంచాయతీలను సందర్శించిన దాఖలాలు లేవని ఆరోపించారు. సమావేశంలో ఎంపీడీవో జవహర్, ఎంపీవో సత్యానంద్, ఏపీవో సురేశ్, సీనియర్ అసిస్టెంట్ శశిధర్‌రాజు, సిబ్బంది రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ అంజయ్య

లింగాపూర్: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని సీఐ అంజయ్య అన్నారు. మండలకేంద్రంలో కేంద్ర బలగాలతో కలిసి శనివారం కవాతు నిర్వహించారు. అనంతరం గాంధీచౌక్ వద్ద ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. చట్ట విరుద్ధంగా ప్రవర్తించినా, గొడవలు సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. మండలంలోని కొత్తపల్లి, కంచన్‌పల్లి, గుమ్నూర్ గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ సీఐ భద్రిప్రసాద్, లింగాపూర్ ఎస్సై ప్రవీణ్ కుమార్, జైనూర్ ఎస్సై సందీప్, సిర్పూర్ ఎస్సై మాధవ్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జెడ్పీటీసీ

వాంకిడి: మండల కేంద్రంలో నిర్వహించిన మహోల్కర్ నితిన్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు శనివారం ముగిశాయి. టోర్నమెంట్‌లో 20 జట్లు పాల్గొనగా డైలీ క్రికెట్ జట్టు విజేతగా నిలిచింది. జెడ్పీటీసీ అజయ్‌కుమార్ హాజరై విజేత జట్టుకు ట్రోఫీ, నగదు రూ.20 వేలు, రన్నర్‌గా నిలిచిన నాని సెలక్షన్ జట్టుకు ట్రోఫీ, నగదు రూ.10 వేలు అందజేశారు. మహోల్కర్ అశోక్, మహోల్కర్ అరున్, అన్వర్ హెస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రన్‌ఫర్ జీసస్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే



రన్‌ఫర్ జీసస్‌లో పాల్గొన్న హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలో శనివారం నిర్వహించిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యేసు ప్రభువు ప్రపంచానికి శాంతి సందేశం అందించారన్నారు. క్రైస్తవులకు ముందస్తుగా ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు



కెరమెరి: పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

దహెగాం: పదో తరగతి వార్షిక పరీక్షలు ఈనెల 18న ప్రారంభం కాగా శనివారం ముగిశాయి. మండలంలో 8 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉండగా 269 మంది విద్యార్థులు ఉన్నారు. వీరి కోసం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. శనివారం సాంఘికశాస్త్రం పరీక్షకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 149 మందికి పూర్తిస్థాయిలో హాజరయ్యాయి. కేజీబీవీ పరీక్ష కేంద్రంలో 120కి 119 మంది హాజరయ్యారు. ఒకరు గైర్హాజరైనట్లు సీఎస్‌లు కిషన్‌రావు, అమరేందర్‌రెడ్డి తెలిపారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వార్షిక పరీక్షలు శనివారం ముగిసినట్లు సీఎస్ గోపాల్ తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద చివరి రోజు నగునూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పండ్ల రసం పంపిణీ చేశారు. మాజీ సర్పంచులు సంజీవ్, సుధాకర్ పాల్గొన్నారు.

కెరమెరి: పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం ముగిశాయి. మొత్తం 296 విద్యార్థులకు గాను అందరూ పరీక్షకు హాజరైనట్లు సీఎస్‌లు చంద్రశేఖర్, స్వర్ణలత, డీవో ప్రేసింగ్ తెలిపారు.

కౌటాల: పదో తరగతి వార్షిక పరీక్షలు మండలంలో శనివారం ముగిశాయి. జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 146 మంది విద్యార్థులకు 146 మంది హాజరైనట్లు ఎంఈవో సోమయ్య తెలిపారు. జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 220 మంది విద్యార్థులకు 220 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.



దహెగాం: పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



పెంచికల్‌పేట్: పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పిస్తాం



కెరమెరి: పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో



దహెగాం: ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి

కెరమెరి: ఉపాధి కూలీలు పని చేసే ప్రదేశంలో సౌకర్యాలు కల్పిస్తామని ఎంపీడీవో కృష్ణారావు అన్నారు. శనివారం మండలంలోని నాగల్గొంది గ్రామంలో సమీపంలో పనులు చేస్తున్న కూలీలకు తాగునీరు, ప్రథమ చికిత్స పెట్టె, షేడ్ నెట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూ. 272 నుంచి రూ.300 లకు కూలి పెంచిందన్నారు. జాబ్‌కార్డులు ఉన్నవారు ఏఈవో మల్లయ్య, కార్యదర్శి సతీశ్ రావు ఉన్నారు.

దహెగాం: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు సౌకర్యాలు కల్పిస్తున్నామని ఎంపీడీవో రాజేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో కూలీలు పని చేస్తున్న ప్రదేశంలో కూలీలకు నీడ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందిస్తున్నామన్నారు. పని ప్రదేశంలో తప్పనిసరిగా కూలీలకు సౌకర్యాలు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు.

వాంకిడి: ఉపాధిహామీ కూలీల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నవేగూడ పంచాయతీ కార్యదర్శి రవికుమార్ అన్నారు. శనివారం జీపీ పరిధిలో ఉపాధిహామీ పనులు జరుగుతున్న పని ప్రదేశాల్లో నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేశారు. పెరుగుతున్న ఎండల దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గ్రామ పటేల్ దత్తు, సీనియర్ మేట్ శ్రీరామ్, తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థినికి ఆర్థికసాయం



సుభద్రను పరామర్శిస్తున్న ఉపాధ్యాయులు

వాంకిడి: మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థిని సామేల గ్రామానికి చెందిన సుభద్ర ఇటీవల ప్రమాదవశాత్తు కాలు జారిపడటంతో నడవలేని పరిస్థితిలో మంచానికే పరిమితమైంది. దీంతో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది శనివారం సామేల గ్రామంలోని సుభద్ర నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బాధితురాలికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కాగా సుభద్ర ప్రస్తుతం మండల కేంద్రంలోని కేజీబీవీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతుంది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నటరాజ్, ఉపాధ్యాయులు మమత, రజిత, నిర్మల, జగదీష్, శ్రీనివాస్, సంతోష్, ఆనంద్, సురేందర్ సంగీత, సరోజ, స్వప్న, సునీల్ ఉన్నారు.

వృథాగా భగీరథ నీరు



వృథాగా పోతున్న నీరు

కెరమెరి: మండలంలోని శంకర్‌లొద్ది గ్రామంలో మిషన్ భగీరథ పైపు పగిలి వృథాగా నీరు పోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఐదు రోజుల క్రితం పైపులైన్ పగిలిపోవడంతో గ్రామానికి సరిగా నీరు సరఫరా కావడం లేదు. దీంతో తిప్పలు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.